సాక్షి
అనంతపురం

సోమవారం । 4 । మార్చి । 2024



'ఆదర్శ'నికి ఆహ్వానం
మోడల్ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 31 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. 8లో



టమాట కిలో రూ.12
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.6°/ 19.6°
జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పలుచోట్ల వేకువజామున చలి వాతావరణం నెలకొంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

తాడిపత్రి అర్బన్: బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా యాగశాల ప్రవేశం చేసి విశేష పూజలు చేపట్టారు. సోమవారం సాయంత్రం 5.30 నిమిషాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ ధ్వజ పటాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి 11 రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళ స్వామివారికి వివిధ వాహన సేవలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సెబ్ ఏఎస్పీ రామకృష్ణ

అనంతపురం: చెక్‌పోస్టుల్లో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఆదివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్ పోస్టుల వద్ద క్షుణ్ణంగా వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. కర్ణాటక నుంచి మద్యం, మత్తు పదార్థాలు, ఆయుధాలు, అక్రమ నగదు ప్రవేశించకుండా చూడాలన్నారు. సీజ్ చేయాల్సిన సమయంలో పాటించాల్సిన నియమ, నిబంధనలు, విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఏఈఎస్ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.


వీఏహెచ్‌ఏలకు పోస్టింగ్



వీఏహెచ్‌ఏలకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పశుశాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు (వీఏహెచ్‌ఏ)గా ఎంపికైన వారికి ఆదివారం పోస్టింగ్ ఆర్డర్లను ఇచ్చారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్ సమక్షంలో తొలుత నాన్‌లోకల్ కింద ఎంపికైన వారికి పశుశాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, కలెక్టర్ ఎం.గౌతమి అనుమతితో నియామక పత్రాలతో పాటు ప్లేస్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు. మిగిలిన వారికి సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా అందించనున్నారు. మొత్తంగా 439 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. కార్యక్రమంలో పశుశాఖ ఏడీలు డాక్టర్ బి.నాగార్జునరెడ్డి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, వీఏఎస్ డాక్టర్ గోల్డ్ స్మన్, తదితరులు ఉన్నారు.

చిరుత సంచారంతో బెంబేలు



చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని చాపిరి పరిసరాల్లో వారం రోజులుగా చిరుత సంచరిస్తోంది. ఆదివారం వ్యవసాయ తోటలో పనులకు వెళ్తున్న కూలీలకు చిరుత కనిపించింది. వారు కేకలు వేయడంతో పక్కనే ఉన్న కొండల్లోకి పారిపోయింది. మూడు రోజుల క్రితం ధనుంజయ్య అనే రైతు చెందిన ఆవుదూడపై దాడి చేసి చంపేసింది. దీంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

ప్రతి అంశంపై ప్రత్యేక నిఘా

- ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం
- ప్రక్రియ పారదర్శకంగా సాగేలా ఉన్నతాధికారుల చర్యలు
- జిల్లా, నియోజకవర్గ, మండలాల వారీగా ప్రత్యేక కమిటీల ఏర్పాటు



అనంతపురం జిల్లా కలెక్టరేట్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఎక్కడా చిన్న పొరపాటు కూడా తలెత్తకుండా ప్రక్రియను ముగించేందుకు పకడ్బందీగా ముందుకు సాగుతోంది. ఎన్నికల నిర్వహణలో క్రియాశీలంగా వ్యవహరించే ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్), ఎస్ఎస్‌టీ (స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్), ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్), వీఎస్‌టీ (వీడియో సర్వైలెన్స్ టీమ్), వీవీటీ(వీడియో వ్యూయింగ్ టీమ్), అకౌంటింగ్ తదితర 6 టీమ్‌లు ఏర్పాటు చేసింది. 33 మంది నోడల్ అధికారులు, 242 మంది సెక్టోరియల్ అధికారులు, 241 మంది సెక్టోరియల్ పోలీసు అధికారులను నియమించింది. జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

కోడ్ ఉల్లంఘనులపై ఎంసీ'సీ'..
ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటిస్తున్నారా లేదా అనే విషయంపై ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) బృందాలు నిరంతర నిఘా ఉంచుతాయి. జిల్లా స్థాయి ఎంసీసీకి ఇద్దరు అధికారులు, నియోజకవర్గ స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించారు. మండల స్థాయిలో ఎంపీడీఓ సారథ్యంలో ఒక ఏఎస్ఐ లేదా హెడ్ కానిస్టేబుల్, ఒక సీనియర్ అసిస్టెంట్ ఉంటారు. ఇలా 31 మండలాలకు బృందాలను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగినట్లు గుర్తిస్తే వెంటనే ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం చేరవేస్తారు.

ప్రలోభాలకు ఎఫ్‌ఎస్‌టీతో చెక్..
ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బు, మద్యం, వస్తువుల పంపిణీ వంటి చర్యలను నిరోధించడంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ) క్రియాశీలకంగా పనిచేస్తుంది. నియోజకవర్గానికి రెండు చొప్పున 8 నియోజకవర్గాలకు 16 ఎఫ్ఎస్‌టీలను నియమించారు. మిగతా టీమ్‌లతో ఈ బృందం సమన్వయం చేసుకుంటూ పనిచేస్తుంది.

చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టం..
జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీలు (సర్వైలెన్స్ స్టాటిస్టికల్ టీమ్‌లు) ప్రత్యేక నిఘా ఉంచుతాయి. నియోజకవర్గానికి మూడు చొప్పున ఎస్ఎస్‌టీలను ఏర్పాటు చేశారు. ఆయా నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమిస్తారు.

అంతా చిత్రీకరణ..
ఆర్ఓ పరిధిలో ఎన్నికలకు సంబంధించి జరిగే ప్రతి ప్రక్రియను వీడియో వ్యూయింగ్ టీమ్ (వీవీటీ) చిత్రీకరిస్తుంది. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఆధ్వర్యంలో ఈ టీమ్ పనిచేస్తుంది. ఈ బృందం ఆర్ఓ కార్యాలయంలో ఉంటుంది. ఇక వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు (వీఎస్‌టీ) నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తూ ఎన్నికల ప్రక్రియను చిత్రీకరిస్తాయి. నియోజకవర్గానికి రెండు చొప్పున జిల్లాలో 16 వీఎస్‌టీలు ఏర్పాటు చేశారు.

ఖర్చుపై నియంత్రణకూ..
ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు పరిశీలనకు కూడా అకౌంటింగ్ బృందాలను నియమించారు. ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 7 కమిటీలు ఏర్పాటయ్యాయి.

పత్రికా ప్రకటనలపైనా కన్ను..
ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు దినపత్రికలు, టీవీ ఛానళ్లలో చేసుకునే ప్రచారానికి సంబంధించి దాఖలు చేసిన దరఖాస్తులను ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) పరిశీలిస్తుంది. అన్నీ సక్రమంగా ఉంటే అనుమతి మంజూరుకు సిఫారసు చేస్తుంది. అభ్యర్థులకు సంబంధించి పత్రికల్లో ప్రచురితమయ్యే కథనాలనూ పరిశీలిస్తారు. అవి పెయిడ్ ఆర్టికల్స్‌గా గుర్తిస్తే విషయాన్ని ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేస్తారు.

కమిటీలకు శిక్షణ పూర్తి



సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాం. క్రియాశీలంగా ఉండే కమిటీలు ఏర్పాటు చేశాం. నోడల్ అధికారులను నియమించాం. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన పనులు పూర్తయ్యాయి. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు శిక్షణ పూర్తి చేశాం. జిల్లాకు సంబంధించి త్వరలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తాం.
– ఎం.గౌతమి, కలెక్టర్

విద్యార్థుల కథ విషాదాంతం

- సముద్రంలో గల్లంతైన ఇద్దరు విద్యార్థులు మృతి
- కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు



అప్పేచెర్ల శేషారెడ్డి, కుందనకోట పెద్దిరాజులు (ఫైల్)

యాడికి/పెద్దవడుగూరు: ఆ తల్లిదండ్రుల కలలు కల్లలైపోయాయి. అలల రూపంలో కంటి పాపల్ని మింగేశాయి. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారులు కళ్లెదుటే విగతజీవులుగా పడి ఉండడం చూసి గుండెలవిసేలా రోదించారు. తమిళనాడు రాష్ట్రం మహాబలిపురం వద్ద సముద్రంలో గల్లంతైన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. వివరాలు.. యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు పెద్దిరాజులు (22), పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు శేషారెడ్డి (22) స్థానిక పెన్నా సిమెంట్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. మూడు రోజుల క్రితం తమ స్నేహితులతో మహాబలిపురానికి విహారయాత్రకు వెళ్లారు. శనివారం ఒడ్డున నిలబడి సముద్రాన్ని చూస్తుండగా, రాకాసి అల వచ్చి వీరిని సముద్రంలోకి లాక్కెళ్లింది. ఆదివారం మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మొదట శేషారెడ్డి మృతదేహం లభ్యం కాగా, కొద్దిసేపటికే పెద్దిరాజు మృతదేహం కనిపించింది.

తల్లడిల్లిన తల్లిదండ్రులు..
కుందనకోటకు చెందిన పెద్దయ్య, లక్ష్మీదేవిలకు ఒక కుమారుడు పెద్దిరాజులు, ఒక కుమార్తె సంతానం. కూలి పనులు చేసుకుంటూ కుమారుడిని చదివిస్తున్నారు. కళాశాల విద్యార్థులంతా విహారయాత్రకు వెళ్తున్నారంటే తల్లిదండ్రులు తమకు తెలిసిన వారి వద్ద రూ. 10 వేలు తీసుకుని కుమారుడికి ఇచ్చి పంపారు.సంతోషంగా తిరిగొస్తాడనుకున్న కొడుకు ఇక లేడని తెలియడంతో వారు శోకసంద్రంలో మునిగిపోయారు.

- పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, వెంకటలక్ష్మి దంపతులకు శేషారెడ్డి ఒక్కడే కుమారుడు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుమారుడిని అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. అలాంటి బిడ్డను మృత్యువు కబళించి వారికి శోకం మిగిల్చింది. మరో మూడు నెలలకు కుమారుడి చదువు పూర్తవుతుందని, ఇక తమ కుటుంబానికి ఏ ఢోకా లేదని అనుకొంటున్న తరుణంలో ఇలా జరగడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన అంతా ఇంతా కాదు.

చక్కగా చుక్కల మందు పంపిణీ

- యజ్ఞంలా 'పల్స్ పోలియో'
- 97.79 శాతం పూర్తి
- మరో రెండు రోజుల కార్యక్రమం



అనంతపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, చిత్రంలో కమిషనర్ మేఘస్వరూప్, జెడ్పీ సీఈఓ నిదియా దేవి

అనంతపురం మెడికల్: జిల్లావ్యాప్తంగా ఆదివారం 'పల్స్ పోలియో' కార్యక్రమం యజ్ఞంలా సాగింది. 5 ఏళ్లలోపు చిన్నారులు 2,79,980 మంది ఉండగా, 2,73,820 మందికి చుక్కల మందు వేశారు. 97.79 శాతం పూర్తి చేశారు. 1,785 బూత్‌లలో 6,970 మంది వాక్సినేటర్లు చుక్కల మందు పంపిణీ చేశారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో 5,026 మందికి పోలియో చుక్కలు అందించారు. 70 మొబైల్ టీంలు 1,294 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశాయి. మంగళ, బుధవారాల్లో కూడా 'పల్స్ పోలియో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలియోను పారదోలుదాం..
పోలియోను పారదోలుదామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం పిలుపునిచ్చారు. అనంతపురం కోర్టు రోడ్డులోని నెహ్రూ నగరపాలక పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమన్నారు. పిల్లలకు తప్పకుండా వేయించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేశారన్నారు. పేదలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి లక్షలాది మందికి సేవలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, జెడ్పీ సీఈఓ నిదియా దేవి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ గంగాధర్ రెడ్డి, డాక్టర్ హనీఫ్ జావెద్, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమోలు గంగాధర్, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలించిన డీఎంహెచ్‌ఓ..
యాడికి: మండల కేంద్రంలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఏర్పాటు చేసిన 'పల్స్ పోలియో' కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి పరిశీలించారు. వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. మండలంలో 0–5 ఏళ్ల పిల్లలందరికీ చుక్కలు వేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు దేవరాజన్, అప్పయ్య, శ్రీరాం కుమార్, పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

'అనంత పాలిటెక్నిక్'కు అత్యుత్తమ ఖ్యాతి

- కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు
- జిల్లాలోనే ఈ అక్రిడిటేషన్ పొందిన తొలి పాలిటెక్నిక్ కళాశాల
- ఉన్నత ప్రమాణాలతో విద్యార్థుల భవితకు బాటలు
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు



పాలిటెక్నిక్ కళాశాల ముఖద్వారం

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు దక్కింది. రాష్ట్రంలో 12 పాలిటెక్నిక్ కళాశాలలకు ఎన్‌బీఏ గుర్తింపు దక్కగా, ఇందులో జిల్లా నుంచి అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఒక్కటే ఉండడం విశేషం. ప్రొఫెసర్ దినేష్ కుమార్ (ఐఐటీ, రూర్కీ) చైర్మన్‌గా ఉన్న 'ఎన్‌బీఏ పీర్ టీమ్' గత ఏడాది డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో కళాశాలను సందర్శించింది. ఇక్కడి పరిసరాలు, ల్యాబ్ సదుపాయాలు, కళాశాలలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు దక్కిన ఉద్యోగాల శాతం, ఫ్యాకల్టీ లభ్యత తదితర అన్ని అంశాలపై అధ్యయనం చేసింది. ప్రమాణాలు అత్యుత్తమంగా ఉండడంతో 'ఎన్‌బీఏ' గుర్తింపు కల్పించారు.

ప్రభుత్వ ప్రత్యేక దృష్టితో సత్ఫలితాలు..
డిప్లొమా కోర్సు చదివే ప్రతి విద్యార్థికి ఉన్నత భవిష్యత్తు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నూతన విద్యా ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టింది.నిపుణుల సహకారంతో పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కోర్సును రూపొందించింది. విద్యా సంవత్సరం పూర్తికాగానే ఉద్యోగాలకు ఎంపికయ్యేలా నైపుణ్యాల పెంపుదలకు బాటలు పరిచింది. అందులో భాగంగానే అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కియా శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పారు. తద్వారా కోర్సు పూర్తికాగానే విద్యార్థులు సులువుగా ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు 192 మందికి కొలువులు దక్కాయి. అల్ట్రాటెక్‌లో 8 మంది, రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలోలో 182 మంది, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ పరిశ్రమలో ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. ఇందులో కొందరు ఏకంగా రూ.8.6 లక్షల వేతనం అందించే ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంటెక్ పూర్తయిన విద్యార్థులకు సైతం అంత పెద్ద మొత్తంలో ప్యాకేజీ లభించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కలలో కూడా ఊహించలేదు




మాది పామిడి. నాన్న రవీంద్ర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కంపెనీలో ఏడాదికి రూ.8.6 లక్షల ప్యాకేజీతో కొలువు దక్కింది. ఇంత పెద్ద మొత్తంతో కూడిన ఉద్యోగం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. అధ్యాపకులు మాపై ప్రత్యేక శ్రద్ధ వహించి శిక్షణ ఇవ్వడమే ఇందుకు కారణం.
– గౌతమి, డిప్లొమా, ఈసీఈ

మాటల్లో చెప్పలేని సంతోషం



టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కంపెనీలో ఏడాదికి రూ.8.6 లక్షల ప్యాకేజీతో కూడిన ఉద్యోగానికి ఎంపికయ్యా. మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఈ ఏడాది మే నెలలో ఉద్యోగంలో చేరతా. బాలచంద్ర నాయక్ సార్ నిర్వహించిన స్పెషల్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లు ఎంతగానో ఉపయోగపడ్డాయి.
– ఎస్.పీ ప్రశాంత్ కుమార్, ఈసీఈ, తాడిమర్రి

ఆనందంగా ఉంది..



మా కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంది. కళాశాలలో అధునాతన సదుపాయాలు ఉన్నాయి. అర్హులైన, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉన్నారు. డిప్లొమా విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడంతో సత్ఫలితాలు వస్తున్నాయి.
– డాక్టర్ సి. జయచంద్రా రెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి



కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. డిప్లొమా మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు ఇండస్ట్రియల్ ఓరియెంటెడ్ శిక్షణ ఇస్తున్నాం. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే 192 మందికి కొలువులు దక్కాయి. మరికొన్ని ఫలితాలు రావాల్సి ఉంది.
– డాక్టర్ రామకృష్ణా రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి

అందుబాటులోకి 'పది' హాల్‌టికెట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి https://bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జిల్లా పేరు, స్కూల్‌పేరు, పుట్టిన తేదీ తదితర వివరాలు నమోదు చేసి విద్యార్థులు కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ నెల 18 నుంచి 30 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 40,063 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 31,330 మంది రెగ్యులర్ విద్యార్థులు, 8,733 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 142 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

తగ్గిన ప్యాసింజర్ రైలు చార్జీలు



హిందూపురం అర్బన్: గుంతకల్లు – హిందూపురం మధ్య సంచరించే ప్యాసింజర్ రైలు ఛార్జీలు తగ్గాయి. రోజూ ఉదయం 6.30 గంటలకు హిందూపురం నుంచి బయలుదేరిన ప్యాసింజర్ రైలు (57438) 11.35 గంటలకు గుంతకల్లు చేరుతుంది. తిరిగి సాయంత్రం 4.15 గంటలకు గుంతకల్లు నుంచి బయలుదేరిన రైలు (57437) రాత్రి 9.10 గంటలకు హిందూపురానికి చేరుతుంది. కరోనా సమయంలో తగినంత మంది ప్రయాణికులు లేని కారణంగా అప్పట్లో చార్జీలను రైల్వే అధికారులు పెంచారు. హిందూపురం నుంచి అనంతపురానికి రూ.55, గుంతకల్లుకు రూ.155 చొప్పున వసూలు చేశారు. ఆదివారం నుంచి తగ్గిన చార్జీలు అమలులోకి వచ్చాయి. దీంతో ఇకపై హిందూపురం నుంచి అనంతపురానికి రూ.30, గుంతకల్లుకు రూ.90 చొప్పున చార్జీలు వసూలు చేయనున్నారు.

పులకించిన 'కోటంక'



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల నాల్గో ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సుబ్రహ్మణ్యేశ్వర నామస్మరణతో కోటంక కొండ పులకించింది. శనివారం రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామున సర్పదోష నివారణ హోమం, విశేష పూజలు చేశారు. పల్లకీ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎద్దులబండ్లు, ట్రాక్టర్లలో వచ్చిన పలువురు భక్తులు చక్కెరపొంగలి వండి, తలనీలాలు సమర్పించారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేశారు. తిరునాల సందర్భంగా దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంది. మాజీ జెడ్పీటీసీ విశాలాక్షి, విజయభాస్కర్ కుటుంబసభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థి దుర్మరణం


మణివర్మ మృతదేహం

అనంతపురం సిటీ: రైలు ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని నాయక్ నగర్‌కు చెందిన నందినేని శివశంకర్ కుమారుడు మణివర్మ(17)... గుల్జార్‌పేటలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం అర్ధరాత్రి అనంతపురం – ప్రసన్నాయపల్లి మార్గంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి


మల్లికార్జున (ఫైల్)

పుట్లూరు: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... పుట్లూరు మండలం గరుగుచింతపల్లికి చెందిన మిద్దెల నాగయ్య, యల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వీరిలో పెద్ద కుమారుడు మల్లికార్జున (44) మానసిక స్థితి సరిగా లేకపోవడంతో తరచూ ఇంటి నుంచి వెళ్లి నాలుగైదు రోజులకు తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లిన మల్లికార్జున తిరిగి వస్తాడని తల్లిదండ్రులు భావించారు. అయితే ఆదివారం ఉదయం గ్రామ శివారులోని బావి నుంచి దుర్వాసన వస్తుండడం గమనించిన మేకల కాపరులు వెళ్లి చూడగా నీటిలో తేలుతున్న మృతదేహం కనిపించింది. కాపరుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయడంతో మల్లికార్జునగా గుర్తించారు. దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

'ఆదర్శ'నికి ఆహ్వానం

నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా 'ఏపీ మోడల్ స్కూళ్లు'

- 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 31 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు చేసుకున్న పాఠశాలలోనే ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష


రాప్తాడులోని ఆదర్శ పాఠశాల

రాప్తాడు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లిష్‌పై పట్టు తప్పనిసరి. ఆంగ్లంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పూర్తి స్థాయిలో పట్టున్న వారు ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నిరుపేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలనే సదుద్దేశంతో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్థాపించిన ఆదర్శ పాఠశాలలు నేడు కార్పొరేట్ విద్యకు పట్టుకొమ్మలుగా మారాయి. జగన్‌సర్కార్ చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారాయి. మెరుగైన విద్యాబోధనతో సత్ఫలితాలను రాబట్టుకుంటున్నారు. సీబీఎస్‌ఈకి అనుబంధంగా ఇందులో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 1న నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 31తో దరఖాస్తుకు చివరి గడువుగా నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా అందజేసిన దరఖాస్తుకు సంబంధించి జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు, ఫొటోను సదరు పాఠశాలలో అందజేయాలి. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చలానా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూళ్లలోనే ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఫలితాలను ఏప్రిల్ 27న వెల్లడిస్తారు.30న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సిలింగ్ ఉంటుంది. జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

టెన్త్ ఫలితాల్లో హవా..

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు ఉంటున్నాయి. దీంతో ఏపీ మోడల్ స్కూళ్లల్లో పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. గత ఏడాది పదో తరగతి పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 1,929 మంది విద్యార్థులు హాజరుకాగా 1,392 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో అత్యధికులు 500కు పైగా మార్కులు సాధించడం గమనార్హం.

ఇంగ్లిష్ మీడియంలో బోధన..

ఇంగ్లిషు మీడియం ప్రధానాంశంగా ఏపీ మోడల్ స్కూళ్లలో ఏటా విద్యార్థులు పెరుగుతూ వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఒక్కసారి 6వ తరగతిలో కాలుపెడితే... ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి అయ్యేవరకూ అక్కడే విద్యాభ్యాసం చేయవచ్చు. ప్రతి తరగతిలోనూ 80 మందికి అవకాశం కల్పిస్తారు. ఇంటర్‌లో ఒక్కో గ్రూపులో 20 మంది చొప్పున విద్యార్థులకు అవకాశం ఉంటుంది. నాణ్యమైన యూనిఫాం, టై, బెల్టు, షూ, పుస్తకాలు, ట్యాబ్‌లు, మధ్యాహ్న భోజనం, లైబ్రరీ, ప్రహరీ సౌకర్యం, విశాలమైన ఆటస్థలం ఉన్నాయి. సీబీఎస్‌ఈ సిలబస్, టోఫెల్, లిప్ తదితర కార్యక్రమాలను అమలు చేస్తుండడంతో చాలా మంది విద్యార్థులు పోటీ ప్రపంచానికి దీటుగా రాణిస్తున్నారు.

ఒక్కో పాఠశాలలో 100 సీట్లు ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆదర్శ పాఠశాలలు 25 ఉన్నాయి. రాప్తాడు, గార్లదిన్నె, పామిడి, గుత్తి, యాడికి, వజ్రకరూరు, ఉరవకొండ, విడపనకల్లు, రాయదుర్గం, కణేకల్లు, కళ్యాణదుర్గం, శెట్టూరు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, ధర్మవరం, పుట్టపర్తి, నల్లచెరువు, అమడగూరు, అగళి, అమరాపురం, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, హిందూపురం మండలాల్లోని ఒక్కో పాఠశాలలో ఆరో తరగతికి గతంలో 80 సీట్లు మాత్రమే కేటాయించే వారు. విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్‌కు జగన్ సర్కార్ సానుకూలంగా స్పందిస్తూ వంద సీట్లకు పెంచారు. ఈ లెక్కన 25 పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు దక్కనున్నాయి. ఒక్కో సీటుకు ఐదు నుంచి పది మంది విద్యార్థులు పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఆదర్శ పాఠశాల లేని మండలాల్లోని విద్యార్థులు సమీప మండలాల ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. సొంత మండల విద్యార్థులు లేని పక్షంలో మాత్రమే పక్క మండలాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. బాలికల కోసం ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం ఉంది.

ఇంటర్ వరకూ ఉచితం



పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. నూతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, మెరుగైన సౌకర్యాలు ఉండడంతో ఈ పాఠశాలకు ఆదరణ పెరిగింది. ఆదర్శ పాఠశాలలో ఒక్కసారి సీటు దక్కితే ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకూ అన్ని సౌకర్యాలు ఉచితంగా అందుతాయి. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవాలనే తపన ఉండే గ్రామీణ విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలో ప్రవేశం మంచి అవకాశం. విద్యార్థులు కూడా సకాలంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిస్తే సీటు దక్కుతుంది.

– పద్మజాదేవి, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల రాప్తాడు

ఉన్నఫళంగా 16 జీవాల మృతి


మృతి చెందిన జీవాలను చూపుతున్న కాపరి

ఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలోని పొలాల్లో ఉన్నఫళంగా జీవాలు మృత్యువాతపడ్డాయి. ఆదివారం ఉదయం కాపరి లక్ష్మన్న తన గొర్రెలు, మేకలను గ్రామ శివారులోని పొలాల్లో మేపునకు తోలుకెళ్లాడు. కాసేపటి తర్వాత 16 గొర్రెలు, మేకలకు ఉన్నట్టుండి కడుపు ఉబ్బి కిందపడి గిలగిల కొట్టుకుంటూ మృతి చెందాయి. కళ్ల ముందే జీవాలు మృత్యువాతపడడంతో కాపరి రోదనకు అంతులేకుండా పోయింది. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారులు డాక్టర్ తులసీరావ్, విష్ణు అక్కడకు చేరుకుని పరిశీలించారు. జీవాల పొట్టలో ఉన్న ఆహార అవశేషాలను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా జీవాల మృతికి కారణం తెలుస్తుందని ఈ సందర్భంగా వైద్యాధికారులు పేర్కొన్నారు. కాగా, జీవాల మృతితో దాదాపు రూ.2 లక్షలకు పైగా నష్టపోయినట్లు బాధిత కాపరి లక్ష్మన్న వాపోయాడు.

సమాజ హితాన్ని ప్రతిబింబించేదే సాహిత్యం


మాట్లాడుతున్న దిగంబర కవి నగ్నముని

అనంతపురం కల్చరల్: సమాజంలోని లోటుపాట్లను ఎత్తి చూపుతూ వాటి పరిష్కారానికి మార్గాలు చూపేదే సాహిత్యమని ప్రముఖ దిగంబరకవి నగ్నముని అన్నారు. ప్రముఖ కవి ముప్పా శ్రీనివాసరావు రచించిన 'అనితరుడు' పుస్తక పరిచయ సభ ఆదివారం స్థానిక కేంద్ర గ్రంథాలయంలో సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ అధ్యక్షతన జరిగింది. జిల్లా రచయితల సంఘం, స్పందన కవుల అనంత వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నగ్నముని మాట్లాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండినారాయణస్వామి, వేణుగోపాలరెడ్డి, అనంత జిరసం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జెన్నే ఆనంద్, కొత్తపల్లి సురేష్, సత్యసాయి జిరసం అధ్యక్షుడు జాబిల్లి జయచంద్ర తదితరులు మాట్లాడుతూ.. శ్రీనివాసరావు రచనా విశిష్టతను కొనియాడారు. 366 వ్యాసాలను పుస్తకంగా తేవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అనంత కవుల వేదిక నిర్వాహకులు రాజారాం, చంద్రశేఖరశాస్త్రి, సీనియర్ రచయితలు తరిమెల అమరనాథరెడ్డి, లక్ష్మీనారాయణ, నబీరసూల్, ఉప్పరపాటి వెంకటేశులు, రియాజుద్దీన్, నానీల నాగేంద్ర, ముదార్ సుధీర్, విజయలక్ష్మి, ఆశ్రయ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే ధ్యేయం

- డీఐఓ యుగంధర్


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డీఐఓ యుగంధర్


ఆత్మకూరు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు


పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి

రాప్తాడు: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని డీఐఓ యుగంధర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన రాప్తాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి, చిన్నారులకు చుక్కల మందు వేశారు. అలాగే జెడ్పీ ఉన్నత పాఠశాల, చిన్మయనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు వయసున్న పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ... పోలియో నిర్మూలనను అందరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఇటుక బట్టీలు, ఇతర పనిప్రాంతాల్లో వలస కార్మికుల పిల్లలందరికీ చుక్కల మందు వేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కాగా, చిన్మయనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్త యల్లమ్మ, ఆశ కార్యకర్త నాగేంద్రమ్మ వేసిన పల్స్ పోలియో ముగ్గును డీఐఓ యుగంధర్ చూసి చాలా బాగుందని అభినందించారు. ముగ్గు కింద నిండు జీవితానికి రెండు చుక్కలు అని రాసిన వ్యాఖ్యలు బాగున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణ, సీహెచ్‌ఓ శివప్రసాద్, అంగన్‌వాడీ హెల్పర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో కేంద్రాన్ని పరిశీలించిన జెడ్పీ సీఈఓ

బుక్కరాయసముద్రం: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కేంద్రాలను జెడ్పీ సీఈఓ నిదియాదేవి పరిశీలించారు. చెదుళ్ల గ్రామంలోని కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. బీకేఎస్‌లో ఎంపీపీ సునీత, సర్పంచ్ పార్వతి పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీస్వాతి మాట్లాడుతూ.. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 4,213 పిల్లలకు గాను 4176 మందికి చుక్కల మందు వేసినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయండి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం వంద శాతం పూర్తి కావాలని 0 నుంచి ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయాలని వైద్య సిబ్బందిని స్టేట్ నోడల్ అధికారి శ్రీనివాసులు సూచించారు. ఆదివారం ఆత్మకూరు మండలంలోని పలు పోలియో కేంద్రాలను ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో మాట్లాడుతూ... తొలి రోజు పోలియో చుక్కలు వేయించుకోని వారిని గుర్తించేందుకు ఇంటింటీ సర్వే చేపట్టాలన్నారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు ప్రతి ఇంటితో పాటు పని ప్రాంతాల్లో తిరుగుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషినల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, డాక్టర్ సబిహసుల్తానా పాల్గొన్నారు.

కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా


గాయపడిన లక్ష్మీదేవి

ఉరవకొండ: విడపనకల్లు మండలం ఉండబండ సమీపంలో కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు... ఉరవకొండ మండలం బూదగవికి చెందిన 15 మంది కూలీలు ఆదివారం ఉదయం విడపనకల్లు మండలం పాల్తూరులో మిర్చి పంట తొలగించేందుకు వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని ని ఆటోలో తిరుగు ప్రయాణమైన వారు ఉండబండ సమీపంలోకి చేరుకోగానే వాహనం ముందు చక్రం ఊడింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో కూలీలు ఎస్.లక్ష్మీదేవి, వి.లక్ష్మీదేవి, మహేశ్వరమ్మ, నాగమ్మ, ఆదిలక్ష్మి, గౌరమ్మ, వన్నూరమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఎస్.లక్ష్మీదేవి, వి.లక్ష్మీదేవిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఏటి గంగమ్మ తిరునాళ్లలో అపశ్రుతి


సాయిచరణ్ (ఫైల్)

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం పెన్నానది ఒడ్డున వెలసిన ఏటి గంగమ్మ తిరునాళ్లలో ఆదివారం అపశ్రుతి చోటు చేసుకుంది. కుటుంబసభ్యులతో కలసి మాఘ మాసం పుణ్య స్నానం ఆచరించేందుకు వచ్చిన ఇంటర్ విద్యార్థి నీటిలో గల్లంతై కొద్దిసేపటికే విగతజీవిగా మారాడు. వివరాలు.. ఉరవకొండలోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న రమేష్, రాజేశ్వరి దంపతుల కుమారుడు సాయిచరణ్ (17) గుంతకల్లులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఏటి గంగమ్మ తిరునాళ్లకు వచ్చాడు. స్నానం చేసేందుకు పెన్నానదిలో దిగిన సాయిచరణ్ అందూ చూస్తుండగానే గల్లంతయ్యాడు. అక్కడున్న వారు కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాసేపటి తర్వాత నీటి ప్రవాహంలో కొద్ది దూరంలోనే విగతజీవిగా ఒడ్డుకు తేలాడు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రుల రోదనకు అంతులేకుండా పోయింది.

అంతర్జాతీయ సదస్సుకు 'సెంట్రల్' విద్యార్థులు

అనంతపురం: చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన మద్రాస్ విశ్వవిద్యాలయంలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఏపీ కేంద్రీయ విశ్వవిద్యార్థులు ఎంపికయ్యారు. సదస్సు 2వ రోజున 'కవిత్రయ మహాభారతం – వర్తమాన సమాజం' సమాలోచన అంశంపై పేపర్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఎంపికైన వారిలో ఎంఏ తెలుగు నాలుగో సెమిస్టర్ చదువుతున్న ఎస్‌హెచ్ భానుశ్రీ, పి.బాలు భీమ్‌రావు, రెండో సెమిస్టర్ విద్యార్థినులు బి.మహాలక్ష్మి, కె.అనిత ఉన్నారు. ఈ మేరకు తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ గరికపాటి గురజాడ, అధ్యాపకులు డా.బత్తల అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు. ఇదే సదస్సులో అధ్యాపకులు డాక్టర్ బత్తల అశోక్ కుమార్ 6వ సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు.

సంతల ఆదాయం రూ.2.97 లక్షలు



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.97 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,55,100 వసూలు కాగా ఆదివారం పశువులు, ఎద్దుల సంత ద్వారా రూ.1,42,630 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

గుంతకల్లులో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రంగస్వామి, సిబ్బంది

గుంతకల్లు టౌన్: స్థానిక ప్రశాంతినగర్‌లో తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి విలువైన బంగారు, వెండి సామగ్రి, నగదు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన మేరకు... గుంతకల్లులోని ప్రశాంతినగర్ శివాలయం వద్ద నివాసముంటున్న మహమ్మద్ నూర్ అలీకు హైదరాబాద్‌లో పెళ్లిళ్ల డెకరేషన్‌కు వినియోగించే సామగ్రి తయారు చేసే చిన్న ఫ్యాక్టరీ ఉంది. మూడు నెలల క్రితం ఆయన తల్లి నూర్‌బీ దుబాయ్‌కు వెళ్లారు. పదిహేను రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల పెళ్లి ఉండడంతో భార్యాపిల్లలను ఆదోనిలో వదిలి నూర్ అలీ హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తీసి ఉండడం గమనించి ఎదురింటి వారు అలీకి ఫోన్ చేసి, విషయం తెలిపారు. రాత్రికి ఇంటికి చేరుకున్న అలీ... ఇంటి గ్రిల్ డోర్ కేసిన తాళం బద్ధలుగొట్టినట్లుగా గుర్తించి లోపలకు వెళ్లి పరిశీలించారు. ఇంట్లోని నాలుగు బీరువాల్లో దాచిన సుమారు 50 తులాల బంగారు నగలు, రెండు కిలోల వెండి సామగ్రి, రూ.1.5 లక్షల నగదు, రూ.50 వేలు విలువ చేసే దుబాయ్ కరెన్సీ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ రంగస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉత్సాహంగా రాతి దూలం లాగుడు పోటీలు



కల్లూరులో పోటీలు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, గుంతకల్లులో రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

గార్లదిన్నె: రైతులను ప్రోత్సాహించేందుకే రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలోని క్షేత్రపాల కొండల్లో వెలసిన సింగరప్ప తిరునాల సందర్భంగా ఆదివారం గ్రామస్తులు నిర్వహించిన న్యూ కేటగిరి వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆలూరి సాంబశివారెడ్డి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వీరాంజనేయులు ముఖ్యఅతిథులుగా హాజరై, పోటీలను ప్రారంభించారు. 14 జతల వృషభాలు పోటీలో పాల్గొనగా ఒక్కో జతకు 20 నిమిషాల చొప్పున సమయం కేటాయించారు. ప్రకాశం జిల్లా గంగన్న పాలెంకు చెందిన ఉమ్మారెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే వైఎస్సార్ జిల్లా రంగసాయిపల్లికి చెందిన వెంకట సుబ్బారెడ్డి వృషభాలు ద్వితీయ, రంగసాయిపల్లికి చెందిన వెంకటసుబ్బారెడ్డి వృషభాలు ఐదో స్థానం దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరుకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి వృషభాలు తృతీయ, పగిడేలకు చెందిన గిరిజ వృషభాలు స్థానంలో నిలిచాయి. అనంతపురం జిల్లా వరదాయపల్లికి చెందిన శ్రీరాములు వృషభాలు నాల్గవ, యంగన్నపల్లికి చెందిన శశికళ వృషభాలు, ఏడో స్థానం, సోములదొడ్డికి చెందిన రామాంజనేయులు వృషభాలు ఎనిమిదో స్థానం దక్కించుకున్నాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పిల్లల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీనాయకులు కేశవయ్య, బృందావన్ రామాంజనేయులు, రవి, ఎస్సీసెల్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా దేశపు ఎద్దుల బల ప్రదర్శన

గుంతకల్లు రూరల్: మండలంలోని వెంకటాంపల్లి కనుమల్లో వెలసిన పెద్ద కదిరప్పస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన దేశం ఎద్దుల బల ప్రదర్శన పోటాపోటీగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి 21 జతల దేశం ఎద్దులను రైతులకు తీసుకువచ్చారు. వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం గాజుల పేట గ్రామానికి చెందిన రైతు రమణయ్య ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. వజ్రకరూరు మండలం, చాబాలకు చెందిన రైతు కుల్లాయప్ప ఎద్దులు ద్వితీయ, గుత్తి మండలం, చెట్నేపల్లికి రైతు ఖాశీం ఎద్దులు తృతీయ, కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామ రైతు రంగస్వామినాయుడు ఎద్దులు నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేత ఎద్దుల యజమానులను అభినందిస్తూ గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి నగదు పురస్కారాలను అందజేశారు.

క్లుప్తంగా

జిల్లా టూరిజానికి అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం నాయకులు

అనంతపురం కల్చరల్: జిల్లాలో టూరిజానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుండటం సంతోషకరమని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆర్కియాలజీ మ్యూజియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వాల్మీకి గుహలు, బిల్వ స్వరం గుహలు, చెరువుల్లో బోటింగ్, పార్కులు అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. టూరిజం మంత్రి రోజా, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రాయలసీమలోని టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న మ్యూజియం సుందరంగా ఉందని కొనియాడారు. పుట్టపర్తి వాటర్ ఫౌంటైన్, పెనుకొండ కట్టడాలు, పెనకచెర్ల డ్యాం, తిమ్మమ్మ మర్రిమాను తదితర చోట్ల ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల సౌజన్యంతో పనులు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ ఏడీ రజిత, కేదార్‌నాథ్, మురళీ, జ్ఞానేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి కిష్టప్ప

అనంతపురం టవర్‌క్లాక్: బీసీలు రాజకీయంగా ఎదిగితేనే తప్ప అభివృద్ధి సాధ్యం కాదని రిటైర్డ్ జడ్జి కిష్టప్ప అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టప్ప మాట్లాడుతూ అత్యధిక జనాబా కలిగిన బీసీ కులాలకు ఆది నుంచి అన్యాయమే జరుగుతోందన్నారు. తక్కువ జనాభా కలిగిన వారే రాజకీయ ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. బీసీలకు చిన్న, చితక పదవులు ఇచ్చి వారి ఎదుగుదల లేకుండా చూస్తున్నారన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా పదవితో పాటు బీసీలకు పవర్ కూడా ఇవ్వాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీధర్, ఆర్‌పీఎస్ నాయకులు శ్రీరాములు, ఆర్‌ఈఎఫ్ నాయకులు రామచంద్ర, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి జయిస్తేనే సత్ఫలితాలు



మాట్లాడుతున్న జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించి ప్రశాంతంగా చదువుకుంటేనే పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించవచ్చని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎస్సీ–4 వసతి గృహంలో పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తులో ముందుకెళ్లగలరన్నారు. ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న తరుణంలో సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. కావాల్సినంత ఆహారం తీసుకోవడంతో పాటు, తగినంత విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకుంటేనే మంచి మార్కులు సాధించగలరన్నారు. తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి హాస్టల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా వార్డెన్లు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

రామలింగమయ్యకు జాషువా పురస్కారం



రామలింగమయ్యను జాషువా కళాభూషణ్ అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: తెలుగు భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గుర్రం జాషువా స్మారక కళాపరిషత్తు 36వ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. సాహితీ, కళారంగాల్లో విశేష కృషి చేస్తున్న వారిని ప్రత్యేకంగా గుర్తించి పురస్కారాలు అందజేశారు. గుర్రం జాషువా స్మారక కళాపరిషత్తు వ్యవస్థాపక చైర్మన్ పెద్దిటి యోహాను, కళారత్న బిక్కి కృష్ణ, చేతుల మీదుగా జాషువా కళాభూషణ్ అవార్డును రామలింగమయ్య అందుకున్నారు. అలాగే జిల్లాకు చెందిన ప్రముఖ గాయకుడు దాసరి ఆదినారాయణకు గౌరవ డాక్టరేట్ అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సంపాదకుడు తోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి

- వైఎస్సార్‌సీపీ గెలుపే మనందరి లక్ష్యం
- ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించాలి
- 'ఎన్నికలకు మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఆత్మకూరు: బీఎల్ఏలకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ఇప్పటి వరకూ ఏ నాయకుడు చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. పార్టీలతో పని లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారు. ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో బీఎల్ఏలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికలకు మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామ, పంచాయతీలో ఇప్పటికే నియమించిన బూత్ ప్రెసిడెంట్లతో పాటు ప్రతి బూత్‌కు కోర్ కమిటీ సభ్యులను నియమిస్తామని తెలిపారు. 2019 నుంచి సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈనెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. 2019లో మంచి చేస్తామన్న నమ్మకంతో ప్రజలు అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించారన్నారు. మళ్లీ కూడా మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందరం కలసికట్టుగా పార్టీ గెలుపుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎంతో మందికి ఉచితంగా బోర్లు వేయించడం జరిగిందన్నారు. పేదలందరికీ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. అనంతరం బీఎల్ఏలకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ విజయ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, నాయకులు మధు, వెంకట్రాముడు, వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, నాగరాజు, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, అలిక్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి, మల్లన్న, సద్దికూటి శివారెడ్డి, తరుణ్, ఈశ్వరరెడ్డి, సర్పంచులు, బీఎల్ఏలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనగానపల్లి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పని చేయాలని పార్టీ కమిటీ సభ్యులు, నాయకులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ బూత్ స్థాయి కమిటీ సభ్యులతో ఎన్నికలకు మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల కానునందన్నారు. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు బూత్ కమిటీ సభ్యుల వరకూ అందరూ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మోసపూరిత హామీలను వివరించాలన్నారు. ఇక బూత్‌ల వారీగా ఉన్న ఓటర్లను కుటుంబాల వారీగా విభజించుకుని ప్రచారం చేయాలన్నారు. మండల స్థాయి పార్టీ నాయకుల నుంచి బూత్ కమిటీ సభ్యుల వరకూ బాగా కష్టపడి పని చేస్తే గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కన్నా ఈసారి వచ్చే ఎన్నికల్లో మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మారుతి, ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, సమన్వయకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఫిట్మెంట్ ప్రకటించాలి



మంత్రి బుగ్గనకు బొకే అందజేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబుళపతి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ ఫిట్మెంట్ ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఓబుళపతి కోరారు. ఆదివారం బేతంచెర్లలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. టీవీ ఎన్ క్యాష్‌మెంట్ బిల్లులు, పీఎఫ్ లోన్స్ అమౌంట్ విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.అస్రఫ్ అలీ ఉన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర



నాట్య కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదిదేవుడి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. భక్తులు తండోపతండాలుగా తరలివస్తూ పరమేశ్వరుడిని దర్శించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాశీవిశ్వేశ్వరుడు, అన్నపూర్ణాదేవి శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కోలాటం ఆడుతూ సందడి చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విచ్చేసిన భజన కళాకారుల హరహర మహాదేవ శంభో శంకర నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆలయంలో రుద్రాభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. శాస్త్రీయ నాట్యకళాకారులు నృత్యాలతో శివుడికి నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి, అనువంశిక సభ్యులు పాల్గొన్నారు.

జగనన్నతోనే కురుబలకు ప్రాధాన్యత



మాజీ మంత్రి శంకరనారాయణను కలిసిన కురుబ సంఘం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కురుబ కులస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం అనంతపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీ కులాల్లో కురుబలు బలమైన సామాజిక వర్గంగా ఉన్నారన్నారు. శంకరన్నను అనంతపురం పార్లమెంటు సమన్వయకర్తగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఆయనకు కులస్తుల తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాస్, సభ్యులు టీచర్ కేసీ నాగన్న, వెంకటేష్, బుల్లే బాలకృష్ణ, చిత్రా నాగరాజు గౌడ్, శివ రుద్రప్ప, పిడుగు కృష్ణమూర్తి, ఎల్ఐసీ వెంకటేష్, వలిగొండ రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీరామకృష్ణయ్య ఆశయ సాధనకు కృషి



నినాదాలు చేస్తున్న రాయలసీమ జనచైతన్య వేదిక నాయకులు

అనంతపురం సెంట్రల్: హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు రూపకల్పనకు కృషి చేసిన శ్రీరామకృష్ణయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని రాయలసీమ ఉద్యమకారులు, రచయితలు, కవులు పిలుపునిచ్చారు. శ్రీరామకృష్ణయ్య జయంతి సందర్భంగా ఆదివారం నగరంలో తెలుగుతల్లి కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ జన చైతన్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. డాక్టర్ కుడితపూడి శ్రీరామకృష్ణయ్య కృష్ణా జలాలను హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా తరలించేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. రాయలసీమలో 40 లక్షల జనాభాకు తాగునీరు, 6.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే విధంగా హంద్రీ–నీవాను రూపకల్పన చేసిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో రచయితలు బండి నారాయణ స్వామి, మహాబోధి కృష్ణమూర్తి, రాయలసీమ జన చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సమాచార హక్కు చట్టం ఉద్యమకారులు హొన్నూరప్ప, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు వెంకటేష్, జై భారత్ నాయకులు కుళ్లాయప్ప, సోమర రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశాన్వి ప్రతిభ



శ్రీశాన్విని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురానికి చెందిన శ్రీశాన్వి టేబుల్ టెన్నిస్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటుకోవడంతో ప్లేయర్స్ స్పోర్ట్ ప్రమోషన్ బోర్డ్‌కు ఎంపికైంది. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వారు విద్య, క్రీడల పరంగా అన్ని సదుపాయాలు కల్పిస్తారు. 7వ తరగతి చదువుతున్న శ్రీశాన్విని అనంతపురం క్లబ్ కార్యదర్శి కేశవ రెడ్డి, అధ్యక్షుడు మురళీ రావు, ట్రెజరర్ పాండురంగయ్య, కోచ్ ధనుంజయ రెడ్డి సత్కరించారు.

యుద్ధ వీరులకు సత్కారం

అనంతపురం కార్పొరేషన్: జిల్లా మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో ఆదివారం 1971 యుద్ధంలో పాల్గొన్న సైనికులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా మాజీ సైనికుల సంఘం గౌరవాధ్యక్షుడు వీకే రంగారెడ్డి, కెప్టెన్ షేకన్న తదితరులు మాజీ సైనికులకు మెమెంటోలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సైనికులు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. కెప్టెన్ ఉమామహేశ్వర రావు, సభ్యులు తిమ్మారెడ్డి, ఈ రంగారెడ్డి, హుస్సేన్ బాషా, బీఏ హుస్సేన్, వైప్రసాద్, రవికుమార్, ఈశ్వరయ్య, నాగిరెడ్డి, నబీ రసూల్, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా మాఘమాస పూజలు



ఆలయంలో అరుణహోమం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాఘమాస పూజలు ముగిశాయి. మాఘమాస ఆఖరి ఆదివారం ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సూర్యనమస్కారములతో పూజలు, అరుణ హోమం తదితర కార్యక్రమాలు చేపట్టారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి, ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం స్వామి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ హోమాలు నిర్వహించారు. మంజునాథ స్వామి, పార్వతి దేవికి పూజలు చేసి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



ఆత్మకూరు: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఆత్మకూరు: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ హేమలత



రాప్తాడు: చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

ఆత్మకూరు/రాప్తాడు/కనగానపల్లి: ఆత్మకూరు, రాప్తాడు, కనగానపల్లిలో ఆదివారం 0–5 సంవత్సరాల పిల్లలకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. ఆత్మకూరు పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నిండు జీవితానికి రెండు చుక్కలు తప్పనిసరి అన్నారు. పంపనూరు ఆలయం, బస్టాండ్ వద్ద పోలియో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సబిహా సుల్తానా తెలిపారు. రాప్తాడు పీహెచ్‌సీ, బొమ్మేపర్తిలో చిన్నారులకు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పోలియో చుక్కలు వేశారు. కనగానపల్లి మండలంలో 98 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ హేమలత,ఆత్మకూరు ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి,నాయకులు వన్నూరప్ప పాల్గొన్నారు. రాప్తాడులో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణ, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు కుమ్మర రాము, జయన్న, వెంకటరాముడు పాల్గొన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం 98.2 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్ తెలిపారు.

అసత్య ప్రచారం మానుకోండి

- మోటర్ల రిపేరీతోనే నీటి సరఫరాలో జాప్యం
- మేయర్ వసీం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నీటి సరఫరా జాప్యంపై పచ్చ పత్రిక ప్రచురించిన కథనంలో వాస్తవం లేదు. ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు మానుకోవాలి. ఎవరెన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మేయర్ వసీం పేర్కొన్నారు. ఆదివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పీఏబీఆర్‌లో మోటర్లు కాలిపోవడంతోనే నీటి సరఫరాలో జాప్యం జరిగిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని పచ్చ పత్రిక ప్రజలను తప్పుదోవ పట్టించేలా చూస్తోందన్నారు. మోటర్ల రిపేరీ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే బెంగళూరులో వాటికి చేయించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పాలకవర్గం ఏర్పాటైన తర్వాత రూ.80 లక్షలతో మోటర్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం మరమ్మతు చేయించిన మోటర్, తమ ప్రభుత్వంలో కొనుగోలు చేసిన కొత్త మోటర్ ద్వారా పంపింగ్ జరుగుతోందన్నారు. ఈ రెండు మోటర్లు నిరంతరంగా పంపింగ్ చేస్తే ఆ మోటర్లు కాలిపోతాయనే ఉద్దేశంతో ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు విశ్రాంతి ఇవ్వడంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు. నీటి సరఫరాలో ఎటువంటి జాప్యం జరగకూడదని రోజూ 12 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందిస్తున్నామన్నారు. ప్రజలు ఫోన్ చేసిన వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మరో మోటర్‌ను త్వరలో రిపేరీ చేయించనున్నట్లు తెలిపారు. ఆ విషయమై ఇంజినీరింగ్ అధికారులు బెంగళూరుకు చెందిన కంపెనీ నిర్వాహకులతో రోజూ వాకబు చేస్తున్నారన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేస్తామన్నారు. భవిష్యత్తులోనూ మోటర్ సమస్య తలెత్తకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో 760 హెచ్‌పీ మోటర్ (రూ.2 కోట్లు) ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వాటి అనుమతి కోసం ఇంజినీరింగ్ చీఫ్‌కు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. 500 హెచ్‌పీ మోటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్టాండింగ్ కమిటీలో వాటి ఆమోదానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ సైపుల్లాబేగ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



పెద్దమ్మ దేవతకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని సిద్దరాంపురం గ్రామ పొలిమేర పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు శాంతి, నవగ్రహారాధన, ప్రధాన కలశ స్థాపన, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గ్రామంలో పెద్దమ్మ తల్లికి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం హోమాలు, పూజలు, మంగళవారం విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

మద్యం మత్తులో హత్య

అనంతపురం: నగరంలోని పాతూరు పవర్ స్టేషన్ వద్ద శనివారం అర్ధరాత్రి ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... సంగమేష్ సర్కిల్ నివాసి బాలయ్య (70) కొంత కాలంగా రాకేష్ నగర్‌లోని ఓ వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. శనివారం రాత్రి తన స్నేహితుడితో కలిసి పూటుగా మద్యం సేవిస్తూ కాలక్షేపం చేశారు. అనంతరం ఇద్దరి మధ్య మాటామాట పెరిగి గొడవపడ్డారు. ఆ సమయంలో సహనం కోల్పోయిన స్నేహితుడు... బాలయ్యను హతమార్చి ఉడాయించాడు. ఆదివారం ఉదయం ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

285 మందికి కంటి పరీక్షలు

అనంతపురం కల్చరల్: నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. మొత్తం 285 మందికి కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వెల్లడించారు. వైద్యులు 201 మందిని ఆపరేషన్లకు రెఫర్ చేశారని తెలిపారు. అనంతరం వచ్చిన వారందరికి అన్నదానం చేశారు. దుప్పట్లను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, అసిపుద్దీన్, నబీరసూల్ పాల్గొన్నారు.

నంద్యాల వెళ్లి పింఛన్ అందజేత



మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

అనంతపురం క్రైం: ఓ వలంటీర్ సొంత ఖర్చులతో అనంతపురం నుంచి నంద్యాలకు వెళ్లి ఓ మహిళకు పింఛన్ అందజేశారు. వివరాలు.. 2వ సచివాలయం సీ–14 క్లస్టర్‌కు చెందిన వలంటీర్ నరేంద్ర పింఛన్లు పంపిణీ చేయడానికి కాలనీలోకి వెళ్లారు. ఎంజీ కాలనీకి చెందిన గిరిజ కల్యాణి అనారోగ్యంతో నంద్యాలలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్నారు. 1వ వార్డు కార్పొరేటర్ లాలప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతు సహకారంతో వలంటీర్ దాసరి నరేంద్ర ఆదివారం నంద్యాలకు వెళ్లి పింఛన్ అందజేశారు. కార్పొరేటర్ లాలప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతు మహిళ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

వాల్మీకి సంఘం మండల కమిటీ ఎన్నిక

రామగిరి: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం ఆదేశాల మేరకు మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకుడు జంబో శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని పెద్దకొండాపురం గ్రామంలో వాల్మీకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా నాగభూషణ, యూత్ కన్వీనర్‌గా కిశోర్, ప్రధాన కార్యదర్శిగా రాజా, కార్యదర్శిగా నరసింహులు, ఈసీ మెంబర్‌గా సురేష్‌ను ఎన్నుకున్నారు.

అనారోగ్యంతో జీఎస్టీ ఉద్యోగిని మృతి

అనంతపురం సిటీ: అనంతపురంలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన ఎన్‌వీ నాగమణి (55) ఆదివారం ఉదయం మరణించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమెకు కుటుంబ సభ్యులు వైద్యం చేయించారు. కోలుకున్నట్లే కోలుకొని మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అంతలోనే ప్రాణాలు కోల్పోయారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. నాగమణి భర్త మల్లికార్జున అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. వారికి ఇద్దరు కుమారులు. విషయం తెలుసుకున్న కేంద్ర జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అనిత, సూపరింటెండెంట్ రంగనాయకులు, సిబ్బంది నాగమణి మృతదేహానికి నివాళులర్పించారు. విధి నిర్వహణలో చాలా నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సచివాలయాల్లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

అనంతపురం కార్పొరేషన్: కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశాలతో ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ నగరంలోని 74 సచివాలయాల్లో ఎక్కడైనా చేసుకునే సౌలభ్యాన్ని కల్పించినట్లు అదనపు కమిషనర్ శ్రీహరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 10 వేల ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

శివరాత్రి విశిష్టతపై ప్రచారం

అనంతపురం రూరల్: శివరాత్రి విశిష్టతపై త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందుజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రుద్రంపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడారు. శివరాత్రి అంటే కర్మ నాశనం జరిగితే కలిగే మోక్షానికి గుర్తు అన్నారు. అందుకే శివరాత్రిని మోక్ష రాత్రి అని కూడా అంటారని తెలిపారు. ప్రజలందరూ మోక్షం పొందాలన్నదే శివరాత్రి పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు రాజేష్, సుధాకర్, సుంకిరెడ్డి, నాగలక్ష్మి, పద్మావతి, లక్ష్మీనారాయణమ్మ, లక్ష్మి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు స్పందన కార్యక్రమం జరగనుంది. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీ హరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, తదితర సెక్షన్ అధికారులు స్పందన నిర్వహించనున్నారు. నగర ప్రజలు తమ సమస్యలు తెలియజేసే అవకాశాన్ని కల్పించారు.